# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

https://trinetnews.com/

తాజా తెలుగు వార్తలు


ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

4 PM TO 7 PM

సంపుటి: 01 | సంచిక:23 | పేజీలు :02 | వేల:2/రూ | ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు | మంగళవారం, సెప్టెంబర్ 08,2026


# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు



- బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై చర్యలు తీసుకోవాలని శాసనసభలో తీర్మానం
- తీర్మానాన్ని ప్రవేశపెట్టిన మంత్రి దామోదర రాజనర్సింహ
- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే ఇందుకు కారణం
- కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని తీర్మానంలో డిమాండ్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ సమావేశాల కాలం మొత్తం వారిని సస్పెండ్ చేస్తున్నట్లు మండలి ఛైర్మన్ ప్రకటించారు. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తాతా మధు, నవీన్ కుమార్‌లపై కాంగ్రెస్ పక్షం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.**

### తీర్మానం ప్రవేశపెట్టిన దామోదర

స్పీకర్‌పై అగౌరవంగా మాట్లాడటంతో పాటు, అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ నేతల ప్రవర్తనపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి దామోదర రాజనర్సింహ శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కూడా ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ, ఎస్సీల చరిత్ర జాతీయ ఆత్మగౌరవంతో ముడిపడి ఉందని, దానిని కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం చేయకూడదని అన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, కానీ రాజ్యాంగబద్ధమైన పదవులను, వ్యవస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంటుందని స్పష్టం చేశారు. “స్పీకర్ పదవి ఏ ఒక్క కులానికో, మతానికో సంబంధించినది కాదు. ఆ అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిని అవమానించడం క్షమించరాని నేరం” అని ఆయన వ్యాఖ్యానించారు. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతల అహంకారం తగ్గలేదని, ప్రజాజీవితంలో ఉన్నవారు బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. మంత్రి దామోదర ప్రవేశపెట్టిన తీర్మానానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పూర్తి మద్దతు తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీలో ఈ తీర్మానం ఆమోదం పొందిన అనంతరం, అధికారిక కాపీని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి పంపించారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరు ఎమ్మెల్సీలపై మండలిలో చర్యలు తీసుకున్నారు.

# మంత్రుల శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా: మహేశ్ గౌడ్

- కేబినెట్ విస్తరణ ఊహాగానాలపై మహేశ్ గౌడ్ స్పందన
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై సూచనలు చేశానని వెల్లడి
- తనకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్ఠానం నిర్ణయమన్న మహేశ్ గౌడ్



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు.ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.

# బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ -2026 పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి

- బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రచారం చేసే ఛాలెంజ్
- అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్న కోమటిరెడ్డి
- తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలని ఆకాంక్ష

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

తెలంగాణ విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న ‘బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ 2026’ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్ రెడ్డిలతో కలిసి సచివాలయంలో ఈ ఛాలెంజ్ అధికారిక పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... షార్ట్ ఫిలింలు, బతుకమ్మ పాటలు, సృజనాత్మక వీడియోల ద్వారా తమ ప్రతిభను చాటుకోవాలనుకునే యువ ఫిలిం మేకర్లకు ఈ ఛాలెంజ్ ఒక అద్భుత వేదికగా ఉపయోగపడుతుందన్నారు. బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రతిబింబించేలా షార్ట్ ఫిలింలను రూపొందించవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో యువ దర్శకులు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలని ఆకాంక్షించారు.



# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు ఊరట.. రిమాండ్‌కు కోర్టు నిరాకరణ

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌కు ఊరట
- పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించిన నాంపల్లి కోర్టు
- ఎమ్మెల్సీలను వెంటనే విడుదల చేయాలని ఆదేశం
- రూ.10 వేల చొప్పున వ్యక్తిగత పూచీకత్తు కోరిన కోర్టు





ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

తెలంగాణ శాసనసభ ఆవరణలో చోటుచేసుకున్న ఉద్రిక్తతల కేసులో అరెస్టైన ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిని రిమాండ్‌కు తరలించాలన్న పోలీసుల అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. దీంతో వారిని వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది.సభాధ్యక్షుడిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో పాటు విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎమ్మెల్సీలపై ఉన్నాయి. అసెంబ్లీ పరిసరాల్లో జరిగిన ఘర్షణలకు సంబంధించి పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు.ఈ కేసులో పోలీసులు దాఖలు చేసిన రిమాండ్ అభ్యర్థనపై న్యాయస్థానం ఇరువర్గాల వాదనలు విన్నది. అనంతరం పోలీసుల అభ్యర్థనను తోసిపుచ్చింది. నిందితులు ఇద్దరూ రూ.10 వేల చొప్పున వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాలతో ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిలను వెంటనే విడుదల చేయనున్నారు. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనపై పోలీసులు తీసుకున్న చర్యలకు ఇది ఎదురుదెబ్బగా మారింది.

# 14 ఏళ్లకే మొదలు.. 20 ఏళ్లకే నెలకు రూ.5 లక్షలు..

# తల్లి కోసం యువకుడి ప్రయాణం

- 20 ఏళ్ల బీహార్ యువకుడి ఫ్రీలాన్సింగ్ కథ వైరల్
- 14 ఏళ్లకే డిజైన్, ఎడిటింగ్ నేర్చుకున్న కుర్రాడు
- డిగ్రీ చదవకుండా వెబ్3 రంగంలోకి ప్రవేశం
- నెలకు 4,000 డాలర్లు సంపాదిస్తున్నానని వెల్లడి
- గత నెలలో 6,500 డాలర్లు వచ్చాయని వెల్లడి



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

చదువు పూర్తిచేసి ఉద్యోగం సంపాదించాలి.. ఇదే చాలామంది యువత ఆలోచన. కానీ బీహార్‌కు చెందిన ఓ 20 ఏళ్ల యువకుడు మాత్రం అందుకు భిన్నమైన దారిని ఎంచుకున్నాడు. 14 ఏళ్ల వయసులో డిజైన్, వీడియో ఎడిటింగ్ నేర్చుకున్నాడు. మధ్యలో ఎన్నో ఒడుదొడుకులు ఎదురయ్యాయి. చివరికి ఫ్రీలాన్సింగ్, వెబ్3 రంగంలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నాడు. డిగ్రీ లేకుండానే నెలకు వేల డాలర్లు సంపాదిస్తున్నానంటూ రెడిట్‌లో తన కథను పంచుకున్నాడు. అతడి జర్నీ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తల్లిదండ్రులు విడిపోయిన తర్వాత ఐదేళ్ల వయసు నుంచి తల్లి వద్దే పెరిగినట్లు ఆ యువకుడు తెలిపాడు. ఆర్థిక ఇబ్బందులతో సాగిన బాల్యంలోనే ఏదైనా చేయాలన్న ఆలోచన వచ్చిందని చెప్పాడు. 2020లో 14 ఏళ్ల వయసులో ఆన్‌లైన్‌లో డిజైన్, ఎడిటింగ్ నేర్చుకున్నాడు. అప్పట్లో పబ్జీ ఈస్పోర్ట్స్ జట్ల కోసం గ్రాఫిక్స్ రూపొందించేవాడు. కొంతకాలానికే పబ్జీపై భారత్‌లో నిషేధం రావడంతో ఆ పని ఆగిపోయింది. 2024లో 12వ తరగతి పూర్తయ్యే వరకు ఫ్రీలాన్సింగ్ చేయాలా? ఉన్నత చదువులు కొనసాగించాలా? అనే సందిగ్ధంలో ఉన్నాడు. అదే సమయంలో నోయిడాలో వెబ్3 మార్కెటింగ్ ఏజెన్సీ ప్రారంభిస్తున్న పాత పరిచయస్థుడి నుంచి అవకాశం వచ్చింది. కాలేజీకి వెళ్లకుండా నోయిడా చేరాడు. నెలకు రూ.15 వేల జీతంతో పని మొదలుపెట్టాడు. భోజనం, వసతి కూడా సంస్థే కల్పించింది. అయితే ఆ ఉద్యోగం సులభంగా సాగలేదు. ఖాళీ గదిలో ఒక పరుపు, ట్రాలీతోనే కొంతకాలం గడిపినట్లు చెప్పాడు. 18 ఏళ్లకే మద్యం, గంజాయి అలవాట్లకు లోనయ్యానని వెల్లడించాడు. ఐదు నెలల తర్వాత ఉద్యోగం వదిలి బీహార్‌కు తిరిగొచ్చాడు. మళ్లీ కొంతకాలం ఒంటరితనం, నిరాశ వెంటాడాయి. ఆ తర్వాత టెక్నాలజీ కమ్యూనిటీలకు ఉచితంగా బ్రాండ్, లోగో డిజైన్లు చేయడం మొదలుపెట్టాడు. నెలకు 200-300 డాలర్లు సంపాదించేవాడు. తర్వాత వెబ్3 రంగంలో మరో పరిచయం ద్వారా సోషల్ మీడియా గ్రాఫిక్స్ పని దక్కింది. క్రమంగా క్లయింట్లు పెరిగారు. డిజైన్ పనులతో మొదలైన ప్రయాణం వెబ్3 సేవల వరకు వెళ్లింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.12 లక్షలు సంపాదించినట్లు అతడు చెప్పాడు. నెలకు 2,000 డాలర్ల నుంచి 4,000 డాలర్లకు ఆదాయం పెరిగిందని తెలిపాడు. గత నెలలో ఏకంగా 6,500 డాలర్లు, అంటే సుమారు రూ.5.7 లక్షలు సంపాదించినట్లు పేర్కొన్నాడు. తన ఆదాయంతో అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకున్నానని, ఎప్పటినుంచో కలగా ఉన్న మ్యాక్‌బుక్ ప్రో కొనుక్కున్నానని చెప్పాడు. అంతేకాదు.. తల్లిని ఆర్థికంగా ఉద్యోగం అవసరం లేని స్థితికి తీసుకొచ్చానని, ప్రతి కొన్ని నెలలకు బంగారం కొంటున్నానని తెలిపాడు. ఇన్నాళ్లూ అద్దె ఇంట్లోనే ఉన్న తమ కుటుంబం కోసం స్థలం లేదా ఫ్లాట్ కొనుగోలుకు కూడా డబ్బు దాచు కుంటున్నట్లు వెల్లడించాడు. అయితే డబ్బు సంపాదించినా తన జీవితంలో కొన్ని విషయాలు కోల్పోయానని ఆ యువకుడు అంగీకరించాడు. ఇప్పటికీ ఒంటరితనం ఉందని, స్నేహితులు చాలా తక్కువ మందేనని చెప్పాడు. తన కథను గొప్పలు చెప్పుకోవడం కోసం కాకుండా.. తమ పరిస్థితులు మారాలని ప్రయత్నిస్తున్న వారికి స్ఫూర్తినివ్వాలనే ఉద్దేశంతో పంచుకున్నానని పేర్కొన్నాడు.

# సోషల్ మీడియాను ఎంతమంది యాక్టివ్ గా వాడుతున్నారు?

## : టీడీపీ నేతలను ప్రశ్నించిన లోకేశ్

- సోషల్ మీడియా వినియోగంపై టీడీపీ నేతలకు నారా లోకేశ్ దిశానిర్దేశం
- ప్రభుత్వ అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన
- ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని సోషల్ మీడియాలో తిప్పికొట్టాలని పిలుపు
- ప్రధాని మోదీని, తనను ఉదాహరణగా చూపుతూ నేతలకు దిశానిర్దేశం
- అమరావతి అభివృద్ధిని విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశం



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. 'పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్' అనే అంశంపై మాట్లాడుతూ, ఆయన నేరుగా సభికులను "మీలో ఎంతమంది సోషల్ మీడియాను చురుకుగా వినియోగిస్తున్నారు?" అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నతోనే సాంకేతికతను రాజకీయ ప్రచారానికి వాడుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. "సోషల్ మీడియానే కదా అని తేలిగ్గా తీసుకోవద్దు. దీనిపై చాలా సీరియస్‌గా ఉండాలి" అని లోకేశ్ నేతలకు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయాలని ఆయన సూచించారు. చిన్న స్థాయి నాయకులైన ఏఎంసీ, కార్పొరేషన్ ఛైర్మన్లు కూడా తాము చేస్తున్న పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ఉదాహరణగా చూపారు. ప్రధాని మోదీ సైతం తన సందేశాలను సెల్ఫీ వీడియోల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు. తాను కూడా సుజ్లాన్ విండ్ ప్రాజెక్టు శంకుస్థాపన, డీఎస్సీపై జరుగుతున్న దుష్ప్రచారం వంటి అంశాలపై సెల్ఫీ వీడియోలు తీసి వాస్తవాలను ప్రజల ముందు ఉంచానని తెలిపారు. విషయం చిన్నదైనా, పెద్దదైనా ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత నేతలపై ఉందని అన్నారు. ప్రతిపక్షాల తీరుపై లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షం పని కేవలం ప్రభుత్వంపై బురద జల్లడమేనని, వారి దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు తమ నాయకుడు 'జగన్ మావిగన్' అంటే గుడ్డిగా సమర్థిస్తున్నారని, కానీ టీడీపీ అలా కాకుండా వాస్తవాలతో ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

# ఎమ్మెల్యేలతో చావు రాజకీయాలు చేయిస్తారా?

: వేముల ప్రశాంత్ రెడ్డి నిప్పులు

- కేసీఆర్‌ను అంతమొందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్న ప్రశాంత్ రెడ్డి
- కేసీఆర్ నివాసం ముట్టడి రేవంత్ ఆలోచనే అని ఆరోపణ
- కేసీఆర్ చావు గురించి మాట్లాడినందుకు రేవంత్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను భౌతికంగా అంతమొందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని... స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన చావును కోరుకుంటున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈరోజు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మీడియా ముఖంగా చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ నిప్పులు చెరిగారు. కేసీఆర్ నివాసమైన ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌పై దాడులు చేస్తామని, 'చావు డప్పు' కొడతామని ఎమ్మెల్యే శంకర్ బహిరంగంగా వ్యాఖ్యానించడం రాజ్యాంగ ఉల్లంఘన అని మండిపడ్డారు. "వెయ్యి డప్పులతో కేసీఆర్ ఇల్లు ముట్టడిస్తామన్నది శంకర్ వ్యక్తిగత మాట కాదు. అది వెనుకుండి నడిపిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనే" అని ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల వేళ సభ్యులను సభకు రానివ్వకుండా కేసీఆర్ ఫాంహౌస్ కు కాంగ్రెస్ శ్రేణులను పంపి దాడులు చేయించడాన్ని తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ చావు గురించి మాట్లాడినందుకు గాను రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను నేరుగా రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకనే కాంగ్రెస్ ఈ రకమైన దిగజారుడు వ్యాఖ్యలు చేస్తోందని ఎద్దేవా చేశారు. హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తూ, మాజీ ముఖ్యమంత్రి ప్రాణాలకు హాని తలపెట్టేలా తీవ్ర వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, వేముల వీరేశంలపై రాష్ట్ర డీజీపీ తక్షణమే సుమోటోగా కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్యేపై తక్షణమే అసెంబ్లీలో

# తీర్మానం పెట్టాలే

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08



రేవంత్ రెడ్డి మాట్లాడితే కేసీఆర్ చావును కోరుకుంటాడు.. కేసీఆర్ చావు గురించి మాట్లాడుతా ఉంటాడు.. కేసీఆర్ పేగులు ఊడపీకి మెడలో వేసుకుంటా అని మాట్లాడుతుంటాడు.. కేసీఆర్ కండ్ల గుడ్లు ఊడపీకి గోటీలాడుతా అని మాట్లాడుతాడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఫైర్ అయ్యారుబీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ... చావు భాష మాట్లాడే రేవంత్ రెడ్డి.. ఇవాళ ఎమ్మెల్యేల చేత కూడా కేసీఆర్ చావాలని చెప్పి మాట్లాడిస్తున్నడు. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇవాళ కేసీఆర్ చావాలి.. దరిద్రం.. కేసీఆర్ చచ్చిపోతే పీడపోతది అని కాంగ్రెస్ ఎమ్మెల్యే మాట్లాడటమంటే.. అది రేవంత్ రెడ్డి ప్రేరేపించి మాట్లాడిస్తున్న మాట అన్నారు.కేసీఆర్ చావును కోరుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడిండు కదా.. ఆ ఎమ్మెల్యేపై తక్షణమే అసెంబ్లీలో తీర్మానం పెట్టాలే. ఆయన శాసన సభ్యత్వాన్నిరద్దు చేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు హరీశ్ రావు. ఏమీ అనని మా నవీన్ రెడ్డి ఎమ్మెల్సీ సభ్యత్వం రద్దు చేస్తామని మీరు పూనుకున్నరే.. ఇయ్యాళ్ల టీవీల్లో మార్మోగుతోంది.. బహిరంగంగానే ప్రెస్ మీట్‌లోనే కేసీఆర్ ప్రతిపక్ష నేత, తెలంగాణ సాధించిన నాయకుడు, పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన నాయకుడి చావు కోరుకునే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రోద్భలంతోనే ఆయన శిష్యుడిగా శంకర్ మాట్లాడిన మాటల మీద స్పీకర్‌కు వినబడతలేదా.. సభలో ముఖ్యమంత్రి తర్వాత ఆ స్థానం ప్రతిపక్ష నాయకుడిది. ప్రతిపక్ష నాయకుడి చావునే కోరుకునే విధంగా ఆ సభలో ఉండే సభ్యుడే మాట్లాడితే స్పీకర్‌కు కనబడుతలేదా..? వినబడుతలేదా..? అని అడుగుతున్నా.స్పీకర్ దీని మీద ఎందుకు చర్య తీసుకోరని హరీశ్ రావు ప్రశ్నించారు. దీని మీద ఎందుకు చర్చ పెట్టరు.. ఎందుకు ఆ శాసనసభ్యుడిని తీసివేయరని అడుగుతున్నానన్నారు. మా మహిళా శాసనసభ్యుల మీద దాడి జరిగితే అసలు దాడే జరుగలేదంటారు. స్పీకర్ ఏకపక్షంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు హరీశ్ రావు. ప్రతిపక్ష నాయకుడి చావును కోరుకుంటే అది మీకు కనబడదు.. వినబడదు.. ఇదేం ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. స్పీకర్‌గా మీరు 119 మంది ఎమ్మెల్యేలను సమానంగా చూడాలన్నారు.

# రేవంత్ రెడ్డి అనే చిల్లరగాడు కేసీఆర్ ఇంటి మీదికి వేలమందిని పంపించాడు : కేటీఆర్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08



ఒక నేరస్థుడు, క్రిమినల్ మనస్తత్వం, క్రిమినల్ ప్రవృత్తి కలిగిన ముఖ్యమంత్రి ఈ రోజు తెలంగాణకు దాపురించడం తెలంగాణ ప్రజల దురదృష్టకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. నిన్న మా ఇద్దరు మహిళా నాయకురాళ్లు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి మీద అత్యంత హేయమైన, అత్యంత నీచమైన దాడి చేయడమే కాకుండా వారిని జుట్టు పట్టి లాగి గొంతు పట్టుకుని, చీర లాగి ఒక దుశ్శాసన పర్వానికి తెరలేపడమే కాకుండా వారి అసమర్థతను, వారి పరిపాలనలో చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఇవాళ స్పీకర్‌ను అడ్డం పెట్టుకుని, స్పీకర్ కులాన్ని అడ్డం పెట్టుకుని చిల్లర రాజకీయానికి రేవంత్ రెడ్డి తెరలేపిండని ఫైర్ అయ్యారు.అందులో ఇంకా విచిత్రమైన మాట మా శాసన మండలి సభ్యుడు నిజానికి స్పీకర్‌ను ఉద్దేశించి ఏమీ అనలేదని కేటీఆర్ అన్నారు. అనకపోయినా నిన్ననే మా నాయకుడు కేసీఆర్ ఆదేశం మేరకు సభ్యుడు ముందుకొచ్చి నేను స్పీకర్‌ను అనలేదు.. నాకు స్పీకర్ అంటే ఎనలేని గౌరవం ఉంది. కానీ స్పీకర్ ఒకవేళ బాధపడితే నేను ఆ మాటను ఉపసంహరించుకుంటున్నా.. విచారం వ్యక్తం చేస్తున్నా అని 24 గంటల కిందటనే మా నాయకుడు కేసీఆర్ ఆదేశం మేరకు స్పష్టంగా పత్రికాముఖంగా, లిఖిత పూర్వకంగా చెప్పడం జరిగిందన్నారు. కానీ కోతికి కొబ్బరిచిప్ప దొరికినట్టు ఈ రేవంత్ రెడ్డి అనే చిల్లరగానికి ఈ అంశాన్ని పట్టుకొని ఇందులో ఎట్లానైనా రాజకీయంగా లాభం పొందాలని చెప్పి కాంగ్రెస్ గూండాలను, కొంతమంది శాసనసభ్యులను ఉసిగొల్పి గజ్వేల్‌లో కేసీఆర్ ఇంటిమీదికి పోలీస్ ఎస్కార్ట్‌ను పెట్టి వేల మందిని పంపించాడని ఆరోపించారు.ఆయన చేతుల్లో ఇయ్యాళ్ల రాజకీయ పదవి ఉంది. అధికారం ఉందని చెప్పి కాంగ్రెస్ గూండాలను పంపించడం జరిగిందన్నారు.